పోతరాజుల ఆట..



చెప్పల్‌బజార్‌లో ఫలహారం బండి మహంకాళి అమ్మవారు

ఫలహారం బండ్ల ఊరేగింపు
తీన్మార్ దరువు!

ఆకట్టుకున్న శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు భవిష్యవాణి వినేందుకు భారీగా వచ్చిన భక్తులు

అంబర్‌పేట: అమ్మవారి బోనాల వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం అంబర్‌పేట మహంకాళి ఆలయంలో రంగం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బురుజు గల్లీ నుంచి అమ్మవారికి ఊరేంగింపుగా నైవేద్యాన్ని తీసుకొచ్చారు.

భక్తితో కొలిచే భక్తులను సల్లంగా చూస్తా..
రంగం కార్యక్రమంలో ఎరుపుల విజయకుమార్ భవిష్యవాణిని వినిపించారు. ప్రకృతిని ఆరాధిస్తే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అన్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో బొడ్రాయిని పునర్ నిర్మించాలని భవిష్యవాణిలో సూచించారు. బురుజు గల్లీలోని హనుమాన్ ఆలయాన్ని పునర్ నిర్మించాలని తెలిపారు. భక్తితో కొలిచే భక్తులను సల్లంగా చూస్తానన్నారు.

ఘనంగా తొట్టెల ఊరేగింపు...
అంబర్‌పేటలో తొట్టెల ఊరేగింపులు కనుల పండువగా సాగాయి. డప్పు చప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాల నడుమ ఫలహార బండ్ల ఊరేగింపులు సందడిగా సాగాయి. అమ్మవారికి భక్తులు తొట్టెల సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారి పూజలో డీసీసీ ప్రధాన కార్యదర్శి
నల్లకుంట: బోనాల ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం నల్లకుంట నర్సింహ బస్తీలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజలో కాంగ్రెస్ నాయకులు ధనుంజయ, జీవన్‌గౌడ్ పాల్గొన్నారు. అదే విధంగా నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్ మాలతి దంపతులు చార్మినార్ భాగ్య లక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యంగ్‌మెన్ అసోసియేషన్.. ఊరేగింపు సెన్సేషన్

కాచిగూడ: యంగ్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చెప్పల్‌బజార్‌లో బోనాల జాతర వేడుక ఘనంగా జరిగింది. కళాకారులు వివిధ వేషధారణతో చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. పోతరాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపు వైభవంగా సాగింది. లింగంపల్లి చౌరస్తా నుంచి మోతీమార్కెట్ వరకు జనంతో నిండిపోయింది. యంగ్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సి.లడ్డూయాదవ్, సి. వినోద్ యాదవ్, శివకుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, కార్పొరేటర్లు వై.అమృత, బోంతు శ్రీదేవి, ఆర్.లక్ష్మణ్ యాదవ్, సి.నంద కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను సల్లంగా చూస్తా

భవిష్యవాణిలో అమ్మవారు



ముషీరాబాద్: ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో సోమవారం సాయంత్రం రంగం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పచ్చికుండపై నిలబడి అమ్మవారి పూనకంతో స్వర్ణలత భవిష్యవాణి వెల్లడించారు. ప్రజలను సల్లంగా చూస్తానని అన్నారు. ప్రతి పౌర్ణమినాడు హోమం నిర్వహించాలని సూచించారు. తప్పులు చేసే వారిని శిక్షిస్తానని హెచ్చరించారు. ప్రతి రోజు ఆలయంలో దూపదీప నైవేద్యాలు సమర్పించి పూజలను మరింత ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈవో సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, నాయకులు శివముదిరాజ్, బి.రాజు, వంగాల నర్సింగ్‌రావు, బాలరాజు, అంజిరెడ్డి, లింగంగుప్తా, పట్నం నాగభూషణం గౌడ్, సతీష్‌గౌడ్, బీజేపీ నాయకులు జమాల్‌పురి నందు, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు.

యువత సయ్యాట.!



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తులు

భక్తిశ్రద్ధలతో ఘటం ఊరేగింపు, గంగతెప్ప పూజ



కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో సోమవారం ఘటం ఊరేగింపు, గంగతెప్ప పూజ, గావు, బలిగంప పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పింగలి వెంకట్రామిరెడ్డి హాల్ నుంచి ఘటం ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ జి. రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, రాజాగౌడ్, బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఏ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ కుమార్‌గౌడ్, బోల్ల రమేష్, నాయకులు శివరాజ్, మద్దల చంద్రయ్యగౌడ్, రాగం రవికుమార్, దోమలగూడ కల్లుగీత సొసైటీ సభ్యులు జంగయ్యగౌడ్, వెంకటేష్‌తోపాటు సొసైటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- అదే విధంగా దోమలగూడ తాళ్లబస్తీలోని ఒగ్రమైసమ్మ దేవాలయంలో జరిగిన పూజలో కార్పొరేటర్ జి. రచనశ్రీ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మన సంస్కృతి ఉట్టిపడేలా బోనాలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో మన సంస్కృతి ఉట్టిపడేలా బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకోవడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని అచ్చయ్యనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తొట్టెల కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిల్‌కుమర్‌యాదవ్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ఎంతో ఉత్సాహంగా బోనాలను అమ్మవారికి సమర్పించుకుంటున్నారని తెలిపారు. ఇతర దేశాల్లో ఉన్న తెలుగు వారు సైతం బోనాల పండుగను వీక్షించడంతో పాటు ఆయా దేశాల్లో కూడా అమ్మవారికి బోనాలను సమర్పించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఆలయాలకు బోనాలు నిర్వహించుకోవడానికి నిధులు కూడా సమకూర్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్, కోమురవెల్లి దేవాలయ కార్యవర్గ సభ్యులు అంజియాదవ్, నల్లపోచమ్మ ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద భవిష్యవాణి వినిపిస్తున్న విజయ్‌కుమార్



డీడీ కాలనీలోని ఆలయం వద్ద తొట్టెల ఊరేగింపులో కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి



కృష్ణగౌడ్‌ను సన్మానిస్తున్న పోచమ్మ ఆలయ ప్రతినిధులు



మేదర బస్తీలో రేషం మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి



కనకాల కట్టమైసమ్మ దేవాలయ పూజలో బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌రావు, జంగ శ్రీనివాస్

డా. కదిరె కృష్ణపై అక్రమ కేసు ఎత్తివేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మూడు నెలల క్రితం సుప్రభాతాన్ని తెలుగులో అనువదించి అర్థం చెప్పిన డా. కదిరె కృష్ణపై అక్రమ కేసు నమోదు చేయడం అప్రజాస్వామిక చర్య అని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సుప్రభాతాన్ని అనువదించి వక్రీకరించారని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీకోటి ప్రవీణ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేస్తే 299 సెక్షన్ కింద కేసు నమోదు చేశారన్నారు. తక్షణమే ఆయనపై పెట్టిన అక్రమ కేసును ఎత్తి వేయాలన్నారు. సోమవారం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్ వెస్లీ, టి.స్కైల్యాబ్‌బాబు మాట్లాడుతూ.. సంస్కృతంలోని అన్ని పదాలను తెలుగులోకి అనువదించి చెబితే మంచిదని, వాటిలో ఏమి అర్థం ఉందో కనీసం ఫిర్యాదు చేసిన వ్యక్తి అయినా ప్రజలకు వివరించగలరా? అని ప్రశ్నించారు. చీకోటి ప్రవీణ్ అనే వ్యక్తి మాట్లాడిన పదాలు ఏ ధర్మం ప్రకారం బుతులు మాట్లాడాడో ఆయననే సెలవివ్వాలన్నారు. తక్షణమే డాక్టర్ కదిరె కృష్ణపై పెట్టిన అక్రమ కేసు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

ధరణి కమిటీ వేయడం అభినందనీయం

నల్లకుంట: గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలో జరిగిన అవకతవకలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ధరణి కమిటీ వేయడం అభినందనీయమని టీపీసీసీ సేవా దళ్ మాజీ చీఫ్ ఆర్గనైజర్ సుబ్రహ్మణ్యం పొన్నాడ అన్నారు. ధరణితో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం

లిబర్టీ: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీరని అనాయం జరిగిందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్రు కుమారస్వామి ఆరోపించారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో బీసీలకు మొండి చేయి చూపించారని ఆరోపించారు. బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ఎన్డీఏ ప్రభుత్వం అన్యాయం చేస్తుంటే బీసీ మంత్రులు బీసీ పార్లమెంటు సభ్యులు, బీసీ రాజ్యసభ సభ్యులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే కేబినేట్ సమావేశమై బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో సవరించి బీసీల ప్రగతి కోసం రెండు లక్షల కోట్లు కేటాయించకపోతే జాతీయ స్థాయిలో బీసీల సమర పోరాటానికి శ్రీకారం చూడతారని, ఆ పోరాటానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఆగస్టు 8,9 తేదీల్లో చలో ఢిల్లీ

పంజగుట్ట: ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ సంఘాల జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 8, 9వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు కుట్ర చేసిందని అందుకు పావులా మందకృష్ణను వాడుకుందన్నారు. మందకృష్ణ మాదిగ ఇప్పటికైనా మౌనం వీడి బీజేపీ చేసిన మోసాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాజకీయ పోరాట వేదిక అధ్యక్షులు చంద్రశేఖర్, వివిధ మాదిగ సంఘాల ప్రతినిధులు బాబురావు, రమేష్, బొంకూరి సురేందర్, సన్నీ, గడ్డ యాదయ్య, మొగులయ్య, బోరెల్లి సురేష్, నక్క మహేష్, విజయలక్ష్మి, ప్రశాంత్, నరేష్, గణేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో 'సినారె'ది ప్రత్యేక ముద్ర

లిబర్టీ: తెలుగు సాహిత్యంలో సి.నారాయణరెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. సి.నారాయణరెడ్డి సాహిత్యం హిందీ, ఇంగ్లిష్ ఇతర భాషల్లో కూడా అనువాదమై జాతీయ స్థాయిలో రచయితగా, కవిగా పేరు పొందారన్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పద్మభూషణ్ జ్ఞానపీఠ అవార్డు అందుకొని తెలుగు సాహిత్యానికి ప్రపంచ చిత్రపటంలో నిలిపారని ఆయన పేర్కొన్నారు. ఇటు రచనలు చేస్తూ అటూ కవిత్వం రాస్తూ అనేక చిత్రాల్లో పాటలు రాసి తెలుగు వెండితెరకు తెలుగు వెలుగులు నింపారని, తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఈ సమావేశంలో సంకీర్త, పి.వి.శ్రీనివాస్ రావు, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర మంత్రివర్గంలో గొల్ల కురుమలకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తమను విస్మరించిందన్నారు. తమకు నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. రూ.10 వేల కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏకే గిడియన్ బాబు



చిక్కడపల్లి: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) తెలంగాణ అధ్యక్షుడిగా డాక్టర్ ఏకే గిడియన్ బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం గోల్కొండ క్రాస్‌రోడ్డులోని చర్చిలో ఆఫీస్ బేరర్స్ ఆధ్వర్యంలో గిడియన్ బాబును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీఎఫ్ ప్రతినిధులు గద్దపాటి విజయరాజు, ఏజే సామ్యూల్, అమూల్‌రజనీ, డేవిడ్ కడారి, ఎం.వందనం, జయశ్రీ, సారా అరుణోదయ, ఎస్టీ ప్రకాష్, ఎంఏ శ్యాంప్రసాదరావు, డానియల్ ప్రకాష్, జయ తదితరులు పాల్గొన్నారు.

'బదిలీలలో 'టీఎన్జీఓస్'కు సంబంధం లేదు'

అబిడ్స్: వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో జరుగుతున్న బదిలీలపై టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. కొంత మంది ఉద్యోగులు తమ స్వార్థం కోసం తమ సంఘం పేరును దుర్వినియోగం చేస్తూ తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలతో పాటు, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల బదిలీలలో కూడా తమ యూనియన్‌కు ఎలాంటి సంబంధం ఉండదని వారు వెల్లడించారు. ఏ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల బదిలీలను ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపడుతారని వారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు పారదర్శకంగా పనిచేస్తున్నారన్నారు.

సామాజిక న్యాయ స్ఫూర్తిప్రదాత ఎస్.జైపాల్‌రెడ్డి

బీసీ కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

కాచిగూడ: జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం 'సామాజిక న్యాయం - ఎస్.జైపాల్‌రెడ్డి'అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సామాజిక న్యాయ స్ఫూర్తి ప్రదాత ఎస్.జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. మండల్ కమిషన్ నివేదికతో వీపీసింగ్ ప్రభుత్వం బీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 27శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టినప్పుడు కేంద్రమంత్రిగా జైపాల్‌రెడ్డి అందించిన సేవలు నిలిచిపోతాయని అన్నారు. కేంద్ర పెట్రోలియం మంత్రిగా ఉన్నప్పుడు పెట్రోల్ బంక్‌లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ.. దేశంలోనే మెజార్టీగా ఉన్న బీసీలు అన్ని రంగాలలో ఎదిగినప్పుడే దేశం ప్రగతి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. బాగయ్య, డాక్టర్ వెంకటరమణ, యుగంధర్‌గౌడ్, రేఖారాణి, డాక్టర్ సరోజనమ్మ, గాదె సమ్మయ్య, ఎస్.రాధిక తదితరులు పాల్గొన్నారు.



జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

నేడు హెచ్‌సీయూలో సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌ను మంగళవారం 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఇనీషియేటివ్ (లైఫ్)' అనే థీమ్‌తో నిర్వహించనున్నారు. 'వికసిత్ భారత్-2047'లో భాగంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)చే ప్రారంభించబడింది. వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక చిక్కులు, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంధన భద్రత, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై వివిధ దేశాల విద్యార్థి ప్రతినిధులు చర్చించనున్నారు. దాదాపు 40 నుంచి 50 మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.ఈ కార్యక్రమానికి హెచ్‌సీయూ అర్థశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చిట్టేడి కృష్ణారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

రైలులో బ్యాగు చోరీ

జీరో ఎఫ్ఐఆర్ నమోదు

కాచిగూడ: రైలులో ఓ ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురైంది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్, సుచిత్ర ప్రాంతానికి చెందిన మురళి భార్య హేమ నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు రైలులో వస్తున్నారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ రైల్వే స్టేషన్ వద్ద చూసుకునే సరికి 8 గ్రాముల బంగారు లాకెట్ ఉన్న బ్యాగు కనిపించలేదు. రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

ఆకస్మిక తనిఖీ

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌ను పశ్చిమమండల డీసీపీ విజయ్ కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సుమారు రెండు గంటల కు పైగా స్టేషన్‌లో ఉన్న ఆయన కేసుల దర్యాప్తు తీరు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, ఇనిస్పెక్టర్ శోభన్‌లు ఆయనకు కేసుల వివరాలు వెల్లడించారు. విధినిర్వహణలో ఎవ్వరూ అలసత్వం వహించకూడదని సూచించారు.

ఆత్మగౌరవ పోరాటానికి బీసీలు సిద్ధం కావాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీసీల కులగణన చేసి లెక్కలు తేల్చితేనే ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బీసీల లెక్కలు తేల్చితేనే ఎంత మంది అగ్రకులాల వారు, ఎంత మంది బీసీలు ఉన్నారో ప్రజలకు తెలుస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తప్పుబట్టారు. అందుకే ఆత్మగౌరవ పోరాటానికి బీసీలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పి పార్టీలకతీతంగా బీసీల సత్తాచాటుతామని ఆయన హెచ్చరించారు.

కొవ్వొత్తుల ర్యాలీ





చిక్కడపల్లి: ఢిల్లీ ప్రమాద ఘటనలో మృతిచెందిన విద్యార్థులకు చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో సోమవారం సాయంత్రం నిరుద్యోగ అభ్యర్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ నేత సలీం మాట్లాడుతూ నిబంధనలు పాటించని కోచింగ్ సెంటర్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో కొన్ని శిక్షణ కేంద్రాలు భద్రతాప్రమాణాలు పాటించకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయే తప్పా భద్రత పాటించడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. శివతేజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



మృతుడు కుమారస్వామి

చిక్కడపల్లి: బోనాల పండుగ వేళ ఓ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చిక్కడపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ మౌనిక తెలిపిన కథనం ప్రకారం... అచ్చయ్యనగర్ ప్రాంతానికి చెందిన పి.కుమారస్వామి(27) ఫ్లవర్ డెకరేషన్ వ్యాపారం చేస్తున్నాడు. గత కొన్నేళ్లుగా భార్య అఖిల, మూడేళ్ల కూతురుతో కలసి ఇక్కడ నివాసం ఉంటున్నాడు. రాత్రిపూట భోజనం చేయడానికి ఇంటి మొదటి అంతస్తులో ఉన్న కుమారస్వామిని పిలవడానికి భార్య వెళ్ళగా ఎంతకూ గది తలుపులు తెరవలేదు. స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి తెరిచి చూడగా అతడు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా ఎస్.ఐ.మౌనిక సిబ్బందితో కలసి సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసికుని దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగానే అతడు ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముసలవ్వను చేరదీసి..
ఆశ్రమంలో చేర్పించి!

అన్నం పెట్టి వివరాలు తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు



వృద్ధురాలితో ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్సై మౌనిక

చిక్కడపల్లి: హిమాయత్‌నగర్ ఫెయిర్ వ్యూ ప్లాజా దగ్గరలో 70 ఏళ్ల బాలమ్మ కొన్నేళ్లుగా ఉంటోంది. ఆమె భర్త 50ఏళ్ల క్రితం చనిపోవడంతో ఆమె బాగోగులు చూసుకోవడానికి ఎవరూ లేరు. ఫుట్‌పాతే ఆమెకు నివాసంగా చేసుకుని దుర్భర జీవితాన్ని గడుపుతోంది. ఈ విషయం తెలుసుకున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఆమెను ఠాణాకు తీసుకొచ్చి అన్నం పెట్టారు. అనంతరం ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘట్‌కేసర్‌లోని లహరి ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులతో మాట్లాడి వృద్ధురాలిని అందులో చేర్పించారు. ఆమె కాలికి చెప్పులు లేకపోవడంతో ఇప్పించి పంపించారు. పోలీసుల సాయం పొందిన వృద్ధురాలు కంటతడి పెట్టుకుని కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎస్సై మౌనిక, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.